క్లుప్తంగా

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

వైరా: వైరా మున్సిపాలిటీలోని 5, 16, 20వ వార్డుల్లో మున్సిపాలిటీ సిబ్బంది శుక్రవారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ చింతా వేణు 20వ వార్డులో పనులను పర్యవేక్షించి.. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నగదు అందజేత

ముదిగొండ: ముదిగొండలో ఇటీవల మరణించిన సుతారి మేస్త్రీ మౌలాలి కుటుంబాన్ని బిల్డింగ్ వర్కర్ల యూనియన్ ప్రతినిధులు శుక్రవారం పరామర్శించారు. దాతలు ద్వారా సేకరించిన రూ.26,500 నగదును మౌలాలి కుటుంబ సభ్యులకు వారు అందించారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్ల యూనియన్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారోజు ఈశ్వరాచారి, సీహెచ్ వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆహ్వానం

ముదిగొండ: ముత్తారంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలకు రావాలని ఖమ్మంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను.. దేవస్థానం చైర్మన్ తుళ్లూరి జీవన్ బాబు, నాయకులు అజయ్, పాపారావులు కలిసి శుక్రవారం ఆహ్వానించారు.

సన్మానాలు..

రంగస్థల కళాకారులకు..

మధిర: మధిర ప్రాంతానికి చెందిన రంగస్థల కళాకారులను శుక్రవారం రంగస్థల దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో సన్మానించారు. సీనియర్ కళాకారులు, మధిర రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్‌ను, మాటూరుపేటకు చెందిన శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దం సుబ్బారావును సన్మానించారు.

గిరిజన గురుకుల సొసైటీ డిప్యూటీ సెక్రటరీ లింగారెడ్డికి..

కొణిజర్ల: మండలంలో తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న చంద్రయ్య పదవీ విరమణ కార్యక్రమాన్ని కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ గురుకుల సొసైటీ డిప్యూటీ సెక్రటరీ లింగారెడ్డి, పలువురు అధికారులు హాజరై చంద్రయ్య దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో గిరిజన సొసైటీ ఖమ్మం రీజినల్ కోఆర్డినేటర్ నాగార్జునరావు, ఎస్ఓఈ ప్రిన్సిపల్ బాలస్వామి, మణుగూరు కళాశాల ఏఓ కృష్ణ, మధుకర్, సునీల్, కొత్తగూడెం ఏఓ ప్రమీల, దమ్మపేట కళాశాల ఏఓ పద్మావతి, స్థానిక కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రజిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంతగుడి హుండీ ఆదాయం రూ.3,134

కారేపల్లి: దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కారేపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి (సంతగుడి) దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఆలయ ఈఓ నల్లమోతు శేషయ్య, భద్రాద్రి డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో హుండీ నగదు లెక్కించగా.. రూ.3,134 లు ఆదాయం వచ్చిందన్నారు. దేవాదాయ సిబ్బంది మూడ్ మోహన్ చౌహాన్, రంగయ్య, పూజారి సతీష్ చార్యులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

సత్తుపల్లిరూరల్: భద్రాచలంలో కూలిన ఐదు అంతస్తుల భవనం ప్రమాదంలో మృతి చెందిన ఉపేందర్, కామేష్ కుటుంబాలకు రూ.కోటి చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సత్తుపల్లిలోని నీలం రామచంద్రయ్య భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈఓను సస్పెండ్ చేయాలని, సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు శ్రీను, శరత్, రాజు, నాగిరెడ్డి, వెంకటేష్, రాఘవులు, కృష్ణ, భద్రం, అలివేలు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం గ్రామంలో శుక్రవారం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో 8 మండలాలస్థాయి కబడ్డీ పోటీలను కాంగ్రెస్ నాయకులు శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు కృష్ణారావు, బీఆర్ఎస్ నాయకులు శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, సంక్రాంతి కృష్ణారావులు లాంఛనంగా ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జగన్మోహన్‌రావు, మల్లేశ్వరరావు, కుటుంబరావు, ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

31నుంచి కోటమైసమ్మ ఆలయంలో బ్రహ్మోత్సవాలు

కారేపల్లి: కొలిచిన వారికి కొంగు బంగారంగా నిలుస్తూ మండలంలోని ఉసిరికాయలపల్లిలో కొలువుదీరిన శ్రీ కోటమైసమ్మ తల్లి ఆలయంలో ఈనెల 31నుంచి ఏప్రిల్ 2వరకు పవిత్ర బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభిరామారావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆయా తేదీల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయని వారు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ మేరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రుణమాఫీ ఏమాయే..

రూ.2లక్షలు రుణమాఫీ అసంపూర్ణం..

- తనఖా రుణాల కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు
- అన్నదాతల ఆశలు ఆవిరి
- పట్టించుకోని అధికారులు, పాలకులు



అమ్మపేట వద్ద సాగులో ఉన్న మొక్కజొన్న పంట

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ఆరు గ్యారంటీలలో ఒకటి రైతు రుణమాఫీ. కానీ రైతులకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల మాఫీ కాలేదు. దీంతో రైతుల ఆశలు తలకిందులయ్యాయి. రైతులు వ్యవసాయ శాఖా కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా.. వాళ్లకు ఎందుకు రుణాలు మాఫీ కావడంలేదో తెలియడం లేదు. ఇంత జరుగుతున్నా.. ఇటు అధికారులు కానీ.. అటు పాలకులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో కొత్త రుణాలు రావడం కష్టమేనని రైతులు ఆశలు వదులుకున్నారు.

ముదిగొండ: మండలంలోని 50వేల ఎకరాల భూమి ఉంది. దానిలో సాగుభూమి 38వేల ఎకరాలు, రైతులు 18,683 మంది ఉన్నారు. మండలంలోని వల్లభి, బాణాపురం, ముదిగొండ, మేడేపల్లిలో ఐఓబీ, యూనియన్ బ్యాంక్, డీసీసీబీ, ఏపీజీవీబీ, ఎస్‌బీఐ బ్యాంకులున్నాయి. రూ.2 లక్షల రుణమాఫీని అర్హులుగా గుర్తించి రుణాలు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

స్పష్టత లేక రైతన్నల ఇబ్బందులు..

కాంగ్రెస్ వస్తే కష్టాలు పోతాయని ఎదురు చూసిన రైతులకు నిరాశే మిగిలింది. బడ్జెట్‌లో కూడా రూ.2 లక్షల రుణంపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. దీంతో రైతులు పొందిన రుణాలకు వడ్డీలు చెల్లించి, రెన్యూవల్ చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికే రెండు లక్షల రుణాలు రాని రైతులు 50శాతం మంది ఉన్నారు. వారంతా పొలం పాస్ బుక్‌లు తనఖా పెట్టి అధిక వడ్డీలపై రుణాలు పొందుతున్నారు. ఆరుగాలం కష్టించి పంట పండించే రైతన్నకు ప్రతి చోట అగచాట్లు తప్పడం లేదు. చివరకు పంట చేతికొచ్చే నాటికి ఏదో రూపంలో నష్టాలు చవి చూడాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

కౌలు ధరలకు రెక్కలు..

గత రెండు, మూడేళ్లుగా కౌలు భూములకు ధరలు పెరగడమే కాక.. ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరిగాయి. నష్టాలను చవి చూడలేక కొంతమంది రైతులు తమ పొలాలను కౌలుకిచ్చి చిరు వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. కౌలు రైతులు ఆదుకుంటాం అంటూ ప్రగల్భాలు పలికిన పాలకులు, అధికారుల మాటలు నీటిమీద రాతలుగా మిగిలాయి. ఇక ఐదు, ఆరు ఎకరాల్లో సాగు చేసిన రైతులకు వడ్డీల భారం తప్పేలా లేదు. బ్యాంకుల్లో తెచ్చిన అప్పులు ప్రతి ఏటా వడ్డీలు చెల్లించి రెన్యూవల్ చేయించుకుంటున్నారు. ఈ ఏడాది పత్తి సరిగా పండక మధ్యలోనే దున్ని, మిర్చి వేశారు. మరికొందరు మొక్కజొన్న వేశారు. బావులు, చెరువులు సమీపంలో ఉన్న రైతులు వరి పంటలు వేశారు. వీరు పెట్టుబడికి బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడంతో కొందరు రైతులు దళారుల నుంచి అధిక వడ్డీలకు తెచ్చి మరీ పంటలు సాగుచేస్తున్నారు.



ముదిగొండలోని డీసీసీబీ బ్యాంక్

50శాతం మందికి మాఫీ కాలే..



50శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదు. రూ.2లక్షల పైన ఉన్న వారు వెంటనే చెల్లిస్తే.. వారికి రూ.రెండు లక్షల రుణమాఫీ ఇస్తామని చెప్పి ఇప్పుడు చేతులెత్తేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోతే ధర్నాలు, రాస్తారోకోలే శరణ్యం.

– కోలేటి ఉపేందర్‌రావు, రైతు సంఘం మండల కార్యదర్శి, చిరుమర్రి

ఆనాడు ఒకే దఫాలో రుణమాఫీ చేశారు..



దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు రైతులు తీసుకున్న రుణాలకు ఒకే దఫాలో రుణమాఫీ చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న అప్పులకు ఎప్పటికప్పుడు వడ్డీలు చెల్లిస్తున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి రైతులకు రుణాలు అందించి ఆదుకోవాలి.

– ఎరబోలు వేణుగోపాల్‌రెడ్డి, మాదాపురం

ముస్లింలకు ఇఫ్తార్ విందు



వైరాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

వైరా: వైరా పట్టణంలోని స్థానిక మజీద్‌లో ఉపవాస ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులకు శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ హాజరై ముస్లింలను ఉపవాస దీక్షలు విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సీతారాములు, మండల అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, ముస్లింలు పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్/తల్లాడ: సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ మసీద్‌లో శుక్రవారం రాత్రి రంజాన్ మాసం సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్ ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. అదే విధంగా తల్లాడలో మసీద్‌లో నిర్వహించిన ఇఫార్ విందులో పరిసర గ్రామాల ముస్లింలు ఈ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం పెద్దలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సదర్ ముజ్జు రహ్మాన్, ఫయాజ్, కమల్ పాషా, గాదె చెన్నారావు, యూనిస్, సదర్ షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

బోనకల్: మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో తహసీల్దార్ పున్నం చందర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పుల్లయ్య, ఆర్ఐ నవీన్, ఉపేందర్, ముస్లిం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా అందిస్తున్న మట్టా దయానంద్

సత్తుపల్లిటౌన్: రంజాన్‌మాసం సందర్భంగా సత్తుపల్లిలోని కమల్‌బజాజ్ షోరూం, కమల్‌మిత్ర కన్సల్టెన్సీల ఆధ్వర్యాన పట్టణంలోని 400 మందికి పైగా నిరుపేద ముస్లిం మహిళలకు రూ.2 లక్షల విలువైన రంజాన్ తోఫాను శుక్రవారం పంపిణీ చేశారు. వీటిని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎండి కమల్‌పాషా, రహ్మత్‌పాషా, షాకీర్, మున్వర్, మాజీ కౌన్సిలర్ రెహానాబేగం, తదితరులు పాల్గొన్నారు.

భీమవరం గ్రామంలో..

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం గ్రామంలో శుక్రవారం మధిర నియోజకవర్గ ముస్లిం ఐక్య సంఘం ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ ముస్లిం కమిటీ అధ్యక్షులు గాలిబ్ సాహెబ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో..



ఎర్రుపాలెం: రంజాన్ తోఫా అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మండలంలోని భీమవరంలో ముస్లిం సోదరులకు స్థానిక కాంగ్రెస్ నాయకుడు, కేపీఆర్ హోమం అధినేత యరమల పూర్ణచంద్రారెడ్డి రంజాన్ తోఫా పంపిణీ చేసి.. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలోని ప్రతి ముస్లిం కుటుంబానికి నూతన వస్త్రాలు, సేమ్యా, పంచదార పంపిణీ చేశారు.

నల్లబ్యాడ్జీలతో ముస్లింల నిరసన

మధిర/ఎర్రుపాలెం: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు 2024ను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ మధిర జామియా మసీద్‌లో, ఎర్రుపాలెం మసీద్‌లో శుక్రవారం ముస్లిం సోదరులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం ఐక్య సంఘం సెంట్రల్ కమిటీ అధ్యక్షులు మౌలానా షేక్ ముజాహిద్, మండల కమిటీ ఉపాధ్యక్షుడు షేక్ ఇమాంసాహెబ్, మసీద్ కమిటీ అధ్యక్షులు ఇస్మాయిల్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఉన్న చట్టాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ బిల్లును రద్దు చేసేవరకు పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్, మహమ్మద్ గౌసుద్దీన్, రషీద్, బాజీ, మక్బూల్ జానీ, రబ్బాని, మహబూబ్ సుభాని, షేక్ వలి, అజీముద్దీన్, బుడన్, కమిటీ సభ్యులు సలాం, ఇమ్రాన్, షంషుద్దీన్, మహబూ, మస్తాన్ వలీ, పఠాన్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

బోనకల్/ముదిగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం బోనకల్ గ్రామశాఖా ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఎదుట, ముదిగొండ తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోటేశ్వరావు, మండల కార్యదర్శి సురేష్, సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి గోపాల్‌రావు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి 15 నెలలు గడుస్తున్నా ఉలుకుపలుకు లేదన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరికి, డీటీ లక్ష్మికి వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, సీఐటీయూ మండల కన్వీనర్ వీరబాబు, సీపీఎం జిల్లా నాయకురాలు పద్మ, మండల కార్యదర్శి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత

ఎర్రుపాలెం: మండలంలోని పెద్దగోపవరం సొసైటీ పరిధిలోని ఇరువురు రైతులు ఇటీవల పలు కారణాలతో మృతి చెందారు. వీరి పేరిట సొసైటీలో గ్రూపు ఇన్సూరెన్స్ చేయించారు. దీంతో వారికి తలా రూ.50వేల నగదు మంజూరు కాగా.. ఆ నగదును శుక్రవారం బనిగండ్లపాడులోని సొసైటీ కార్యాలయంలో మృతుల నామినీలు యశోద, పద్మావతిలకు సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ సూపర్వైజర్ సుధాకర్, సీఈఓ వీరారెడ్డి, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అవరణార్చన కల్పం' ఆవిష్కరణ

బోనకల్: మండలంలోని రావినూతల గ్రామానికి చెందిన డాక్టర్ ఇంగువ మురళీ కృష్ణ శర్మ రచించబడిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి అవరణార్చన కల్పం అనే గ్రంథాన్ని పుష్పగిరి మహాసంస్థాన పీఠాధిపతి శంకరాచార్య సద్గురు శ్రీ విద్యాశంకరీభారతీ స్వామి శుక్రవారం హైదరాబాద్‌లోని పుష్పగిరి పీఠంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ.. ఈ గ్రంథావిష్కరణ జరగడం నరసింహస్వామి అనుగ్రహం చేతనే సాధ్యమైందన్నారు.

నేడు జక్కంపూడి విగ్రహావిష్కరణ

తల్లాడ: తల్లాడ సర్పంచ్‌గా, సొసైటీ అధ్యక్షుడిగా పనిచేసిన జక్కంపూడి కృష్ణమూర్తి విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. తల్లాడ మండలం బిల్లుపాడులో శుక్రవారం జరిగిన సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాపా సుధాకర్, నాయకులు దిరిశాల నరసింహారావు, దుండేటి వీరారెడ్డి మాట్లాడారు. నలభై ఏళ్ల రాజకీయ నేపథ్యం కలిగి తల్లాడ అభివృద్ధిలో పాలుపంచుకున్న జక్కంపూడి సేవలను గుర్తు చేసుకునేలా బిల్లుపాడు గ్రామస్తుల సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ విగ్రహాన్ని శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరిస్తారని చెప్పారు. నాయకులు దీవెల కృష్ణయ్య, గోవింద్ శ్రీనివాసరావు, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, అడపా అనిల్, రాయల రాము, గణేశుల రవి, తూము వీరభద్రరావు, దిరిశాల వెంకట్రామయ్య, కొమ్మినేని వెంకటేశ్వర్లు, జక్కంపూడి కిషోర్, రాము, దీవెల బాబు, రామ అప్పారావు, తుమ్మలపల్లి రమేష్, కొమ్మినేని ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

వైరారూరల్: ఖమ్మం జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని విప్పలమడక, లింగన్నపేట గ్రామాల్లోని మొక్కజొన్న కల్లాలను పరిశీలించారు. అనంతరం ఖమ్మంలో కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీజకు వినతిపత్రం అందజేశారు. మాజీ సర్పంచులు కృష్ణారావు, జాన్ పాపయ్య, సొసైటీ డైరెక్టర్ కృష్ణామాచారి, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లి: మున్సిపాలిటీలో వేచి చూస్తున్న లబ్ధిదారులు



వైరాలో సర్వర్ డౌన్ కావడంతో పనులు నిలిపి వేసిన అధికారులు

సతాయించిన సర్వర్

- ఎల్ఆర్ఎస్ కట్టేందుకు లబ్ధిదారుల ఇబ్బందులు
- మధ్యాహ్నం వరకు పడిగాపులు
- గడువు రెండురోజులే..

మున్సిపాలిటీ	దరఖాస్తులు	ఆదాయం
మధిర	450	రూ.2.30కోట్లు
సత్తుపల్లి	280	రూ.1.30కోట్లు
వైరా	100	రూ. కోటి

సత్తుపల్లి/మధిర/వైరా: ఎల్ఆర్ఎస్ గడువు సమీపిస్తుండటం.. సర్వర్ తరచూ సతాయిస్తుండటంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు సర్వర్ మొరాయించి.. తర్వాత మళ్లీ పనిచేయటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ నెల 31వ తేదీలోగా గడువు ముగుస్తుండడంతో చివరి రెండురోజులు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీ యంత్రాంగం కరపత్రాలు, మైకుల ద్వారా అవగాహన కల్పించటమే కాకుండా వ్యక్తిగతంగా ఫోన్లు చేసి ఎల్ఆర్ఎస్ అవసరాన్ని ప్రచారం చేశారు. వరుసగా రెండురోజులు సెలవులు ఉన్నా.. ఎల్ఆర్ఎస్ చెల్లించేందుకు సిటిజన్ మొబైల్‌యాప్, నెట్ సెంటర్ల ద్వారా చెల్లించే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీలో 3,600 మందికి గాను 2,784 మందికి నోటీసులు ఇస్తే 280 మంది లబ్ధిదారులు ఎల్ఆర్ఎస్ ద్వారా ఆన్‌లైన్ చేసుకున్నారు. అదే విధంగా మధిర మున్సిపాలిటీలో 4,276 దరఖాస్తులకు 450మంది లబ్ధిదారులు ఆన్‌లైన్ చేసుకున్నారు. వైరా మున్సిపాలిటీలో 200 దరఖాస్తులకు 100మంది ఆన్‌లైన్ చేసుకున్నారు.



మధిర: మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లిస్తున్న దరఖాస్తుదారులు

అన్నదాతలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న దెందుకూరు సొసైటీ అధ్యక్షుడు కోట వెంకటకృష్ణ

మధిర: దెందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం.. అన్నదాతలకు అండగా ఉంటుందని ఆ సంఘం అధ్యక్షుడు కోట వెంకటకృష్ణ తెలిపారు. శుక్రవారం దెందుకూరు సొసైటీలో జరిగిన మహాజన సభలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు రూ. 3.50కోట్లు రుణమాఫీ జరిగిందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్ ఏడుకొండలు, సంఘ కార్యదర్శి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైరా: వైరాలోని సొసైటీలో రైతు సేవలను విస్తరించడం జరుగుతుందని వైరా విశాల సహకార పరపతి సంఘం చైర్మన్, మార్క్‌ఫెడ్ మాజీ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ అన్నారు. శుక్రవారం వైరాలో రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సొసైటీ మహాజన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రుణమాఫీ కింద రూ. 6.19 కోట్లు మాఫీ వర్తించిందన్నారు. 137 మంది రుణమాఫీ పొందిన రైతులకు తిరిగి రూ.90.73 లక్షలు రుణాలు ఇచ్చామన్నారు. సెక్రటరీ బొల్లం రామకృష్ణ 2024–25 సంవత్సరానికి గాను వార్షిక ప్రణాళిక సభలో ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సభ పరిశీలకురాలిగా సహకార కార్యాలయ అధికారి ఇందుమతి డైరెక్టర్లు కొప్పుల వెంకటేశ్వరరావు, బొల్లెపోగు శ్రీను, తేజావత్ రామకృష్ణ, తాతా బసవయ్య, స్వరూపరాణి, తడికమళ్ల ధనలక్ష్మి పాల్గొన్నారు.

కారేపల్లి సొసైటీలో..

కారేపల్లి: కారేపల్లి సొసైటీలో రైతులు తమ రుణాలను రెన్యూవల్ చేసుకుంటే, 3శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందని సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కారేపల్లి సొసైటీలో నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. సంఘంలో 3,301మంది రైతులకు రూ.19.45కోట్ల రుణాలు అందించామన్నారు. వాటిని రెన్యూవల్ చేయకపోతే 13శాతం వడ్డీతో పాటు చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. సంఘం పరిపాలన భవనానికి అదనపు గదులు, సంఘం ఆవరణలో డీసీసీబీ బ్రాంచ్ నూతన భవన నిర్మాణానికి మహాజన సభ తీర్మానించింది. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు మంగీలాల్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, డీసీసీబీ సూపర్‌వైజర్ వేణి, కార్యదర్శి హన్మంతరావు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల సొసైటీ ద్వారా 7.40 కోట్ల రుణమాఫీ

కొణిజర్ల: కొణిజర్లలోని గోపవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కింద రైతులకు ప్రభుత్వం నుంచి రూ.7.40 కోట్లు రుణమాఫీ వర్తించిందని చైర్మన్ చెరుకుమల్లి సత్యనారాయణ(రవి) సీఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. సొసైటీ పరిధిలో 5,200 మంది రైతులున్నారని, దాదాపు రూ.25 కోట్ల లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ రమేష్, సహకార శాఖ పర్యవేక్షణాధికారి అఖిలా బేగం, డైరక్టర్లు పాల్గొన్నారు.

తల్లాడ సొసైటీలో రూ.7.73 కోట్ల రుణాలు..



మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి

తల్లాడ: తల్లాడ సొసైటీ పరిధిలోని రైతులకు మొత్తం రూ.7.73 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు సొసైటీ అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తల్లాడ సొసైటీలో నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. సొసైటీ బకాయిల్లో రూ.3 కోట్లు వసూలైయ్యాయని, ఇంకా రూ.4 కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు. సొసైటీలో 1,941 మంది రైతులు సభ్యులుగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌కుమార్, సీఈఓ నాగబాబు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సిస్టర్ సెల్వీకి ఘన నివాళి



సిస్టర్ సెల్వీజోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

వైరా: వైరా మున్సిపాలిటీ శాంతినగర్‌లో గల మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో 7 ఏండ్ల పాటు ప్రధానోపాధ్యాయురాలిగా పని చేసిన సిస్టర్ సెల్వీ జోస్ అనారోగ్యంతో ఈ నెల 19న బెంగళూరులో మృతి చెందారు. ఆమె జ్ఞాపకార్థం శుక్రవారం పాఠశాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఓల్డు టీచర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సిస్టర్ యమున, సెయింట్ అలోషియస్ పాఠశాల తనికెళ్ల హెచ్‌ఎం సిస్టర్ జౌలీ, సిస్టర్లు ప్రదీప, జసింత, బెన్నెట్, పాత, ప్రస్తుత పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కూలి రూ.600 చెల్లించాలి

సత్తుపల్లిరూరల్: ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు రోజు కూలి రూ.600 చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ అన్నారు. సత్తుపల్లి మండలం రామానగరంలో ఉపాధి కూలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీల సమస్యలపై బీకేఎంయూ ఆధ్వర్యంలో 15రోజుల పాటు ప్రతీ గ్రామంలో ఆందోళన నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ముత్యాలు, నాగేష్, కృష్ణ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల వితరణ

కారేపల్లి: సింగరేణి (కారేపల్లి) గ్రామ పంచాయతీలో ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన వీధి విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేసేందుకు కారేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేదరి టోనీవీరప్రతాప్ రూ.10వేలు విలువ గల వీధిలైట్లు, వీడీ పరికరాలను గ్రామ కార్యదర్శి నిరంజన్‌కు శుక్రవారం వితరణగా అందజేశారు. ఇటీవల సింగరేణి గ్రామ పంచాయతీలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ చొరవతో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారని, కాగా..గ్రామ పంచాయతీలో నిధులు లేకపోవటంతో, స్వచ్ఛందంగా వీధిలైట్ల కొనుగోలు చేపట్టి వితరణగా అందజేసినట్లు టోనీ పేర్కొన్నారు.

విద్యార్థినికి రూ.62 వేలు ఆర్థిక సాయం

కల్లూరు: కల్లూరు పట్టణానికి చెందిన చింతలపూడి కృష్ణయ్య, కిరణ్‌కుమారి దంపతుల కుమార్తె నందిని బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రులు నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావు నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లి రూ.62 వేల చెక్‌ను కళాశాల మొదటి సంవత్సరం ఫీజు కింద మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ వాలంటీర్లు బైర్ల వెంకటేశ్వరరావు (బీవీ), ఉబ్బన బాబూరావు పాల్గొన్నారు.

తూము మూసినా.. నీరు ఆగదే

కల్లూరు: కల్లూరు పెద్ద చెరువు పెద్ద తూము మూసివేసినా.. తూము లీకై నీటి ప్రవాహం పోవడంతో దాని కింద పంట వేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఖరీఫ్‌లో కూడా ఇదే సమస్య రావడంతో ఇరిగేషన్ అధికారులు రూ.3 లక్షలతో తూముకు మరమ్మతులు చేయించారు. అప్పటి వరకు ఒకమోటర్ స్థాయిలో బయటకు వెళ్లిన నీరు.. ప్రస్తుతం నాలుగు మోటార్ల స్థాయిలో నీరు బయటకు వెళ్తుంది. దీంతో రైతులు చేతికొచ్చిన పంట నాశనం అవుతుందని ఆందోళన చెందుతున్నారు. మరో వారం రోజుల్లో కోతలు ప్రారంభమవుతాయని, అధికారులు మరమ్మతులు చేయించి తూము నీటిని ఆపాలని రైతులు కోరుతున్నారు.